శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

● వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి

హయత్‌నగర్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి మండపాల నిర్వాకులను కోరారు. బుధవారం హయత్‌నగర్‌లోని ఎస్‌వీ కన్వెన్షన్ సెంటర్‌లో హయత్‌నగర్ పోలీసులు నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మండపాల నిర్వహకులు తమ పూర్తి సమాచారాన్ని పోలీసులకు అందించాలన్నారు. మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని మండపం వద్ద ఇసుక, నీరు దగ్గర పెట్టుకోవాలని సూచించారు. నేలపైన కాకుండా కనీసం మీటర్ ఎత్తులో మండపాలను ఏర్పాటు చేసుకోవాలని, అదేవిధంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. జనానికి తగ్గట్టుగా మండపాలను నిర్మించుకోవాలని సూచించారు. మండపాల వద్ద చిన్న పిల్లలను కాకుండా అవగాహన కలిగిన పెద్ద మనుషులను ఏర్పాటు చేయాలన్నారు. ఇతరులకు భంగం కలగకుండా తమ కార్యక్రమాలను నిర్వహించుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి పాటలు మాత్రమే ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మండపానికి పోలీసులు వస్తారని తెలిపారు. నిమజ్జనం ఏ రోజు చేస్తారో.. ఎక్కడ చేస్తారో.. పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సౌండ్ పొల్యూషన్ లేకుండా మండప నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జూదం లాంటి ఆటలు ఆడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్, ఎస్‌ఐలు వెంకటిరెడ్డి, లక్ష్మీనారాయణ, లింగారెడ్డి, సైదులు, నెహ్రూనాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ కాశిరెడ్డి



కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శనను తిలకిస్తున్న సందర్శకులు

ఆకట్టుకుంటున్న కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శన

ఎల్‌బీనగర్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): చేనేత కళాకారులను మరింత ప్రోత్సహించాలన్న లక్ష్యంతో చేనేత హస్తకళల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు కళాసిల్క్ సొసైటీ ప్రతినిధి వికాస్ జైన్ తెలిపారు. అల్కాపురి భవన్ కమ్యూనిటీ హాల్‌లో కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే పోచంపల్లి చీరలు, బెడ్‌షీట్స్, వెస్ట్ బెంగాల్ జాంధానిశారీస్, రాజస్థాని కోటాశారీస్, మంగళగిరి, ఉప్పాడ, చీరాల, వెంకటగిరి, ధర్మవరంశారీస్, కలంకారి చేనేత డ్రెస్ మెటీరియల్, లక్నో చికెన్‌వర్క్ కుర్తీస్, వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలు తీరొక్క వస్త్రాలు యువతకు మెచ్చే విధంగా వస్త్ర ప్రదర్శనలో అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. ఈ ప్రదర్శన సెప్టెంబర్ 16 వరకు ఉదయం 11గంటల నుండి రాత్రి 9 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఈ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ఎంపీ ఈటల రాజేందర్, సామ రంగారెడ్డి, కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డికి ఆశీర్వచనాలు అందిస్తున్న హనుమాన్ ఆలయ అర్చకులు

హనుమాన్ ఆలయంలో ఎంపీ ఈటల పూజలు

చంపాపేట, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డితో కలిసి మంగళవారం రాత్రి సందర్శించారు. ఆలయ ఈఓ ఎస్.లావణ్య, పండితులు, అర్చకులు ఎంపీకి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలోని ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో ఎంపీ, కార్పొరేటర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పండితులు, అర్చకులు వారికి ఆశీర్వచనాలు అందించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిల్వేరి అనీల్‌కుమార్, ఆకుల అఖిల్, ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సబితారెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

సరూర్‌నగర్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): తమ డివిజన్‌లో గతంలో తీవ్రంగా ఉన్న వరద ముంపు సమస్య ఎమ్మెల్యే పి.సబితారెడ్డి కృషి వల్ల పరిష్కారమైందని, ప్రస్తుతం భారీ వర్షాలు కురిసినా తమకు ముంపు ముప్పు లేదని బడంగ్‌పేట్ 22వ డివిజన్ కార్పొరేటర్ లిక్కి మమతాకృష్ణారెడ్డి అన్నారు. తమ సమస్యను శాశ్వతంగా పరిష్కరించిన సబితకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానికులతో కలిసి సబితారెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో చిన్నపాటి వానకే తమ కాలనీలు జలమయమయ్యేవని, నెలల తరబడి నివాస గృహాలు నీటిలోనే ఉండేవని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఎస్ఎన్‌డీపీ పథకంలో భాగంగా భారీ ట్రంక్‌లైన్ నిర్మింపజేసి తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారని అన్నారు. ఆమెకు తనతో పాటు ఇక్కడి నివాసితులు జీవితాంతం రుణపడి ఉంటామని మమతారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్‌లోని పలు కాలనీలకు చెందిన సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

కుమ్మరిబస్తీలో వీధి దీపాల మరమ్మతు పనులు

చంపాపేట, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని కుమ్మరిబస్తీలో వీధి దీపాలు వెలుగకపోవడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు జీహెచ్ఎంసీ విద్యుత్ విభాగం సిబ్బంది స్పందించారు. బుధవారం విద్యుత్ సిబ్బంది వీధి దీపాల మరమ్మతు పనులను చేపట్టారు. దీంతో బస్తీలోని శివాలయం చైర్మన్ లక్ష్మయ్య, బస్తీవాసులు పురుషోత్తం, ప్రవీణ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి విద్యుత్ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎల్బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ అన్నారు. బుధవారం వనస్థలిపురం డివిజన్‌లోని పలు కాలనీల్లో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి పర్యటించి కాలనీవాసుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. మట్టి గణపతులను కాలనీవాసులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట: శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి



వీరయ్యను సత్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో క్రీడాలను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టడంతో పాటు క్రీడలకు పెద్దపీట వేస్తోందని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివాసేనా రెడ్డి అన్నారు. బుధవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డికి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యలకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివసేనా రెడ్డి మాట్లాడుతూ రాబోయే కొత్త స్పోర్ట్స్ పాలసీలో పారా స్పోర్ట్స్ చేర్చుతామని అన్నారు. త్వరలోనే అధికారికంగా పారా స్పోర్ట్స్ కార్యాలయ గది ఏర్పాటు చేస్తామన్నారు. ఒక ప్రత్యేక అధికారిని పారా స్పోర్ట్స్ బాధ్యతలకు కేటాయిస్తూ అన్ని రకాలుగా అండగా ఉంటామని తెలిపారు. పారాఒలంపిక్స్‌లో రాణించిన జీవన్‌జీ దీప్తి దేశానికి గర్వకారణమని అన్నారు. వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య మాట్లాడుతూ జీవన్‌జీ దీప్తి 400 మీటర్ల రన్నింగ్‌లో పారా ఒలంపిక్‌లో క్యాంస పతకం సాధించడం గర్వకారణమని అన్నారు. పారా ఆటగాళ్లందరికీ వికలాంగులకు అందించే పరికరాలలో ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు సింగారపు బాబు, ప్రధాన కార్యదర్శి డిపల్లి ప్రశాంత్, సలహాదారు సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కాకి మాధవరావు, జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

పేదల సమస్యలపై మార్క్స్, అంబేడ్కర్ భావాలు ఒక్కటే

● ఉమ్మడి రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు

రాంనగర్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): పేదల సమస్యలు పరిష్కరించడానికి మార్క్స్, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ భావాలు ఒకటేనని ఉమ్మడి రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు అన్నారు. యువత మార్క్స్, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌లను స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేయాలని సూచించారు. బుధవారం తెలంగాణ ప్రజా సాంస్కృతిక ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ రచయిత జి.రాములు రచించిన 'లాల్‌నీల్ స్ఫూర్తి ప్రదాతలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకి మాధవరావు పాల్గొని మాట్లాడారు. రచయిత 'లాల్ నీల్ స్ఫూర్తి ప్రదాతలు' పుస్తకంలో అనేక మంది ప్రముఖులకు సంబంధించిన స్ఫూర్తిదాయకమైన విషయాలను ప్రస్తావించడం అభినందనీయమన్నారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, జస్టిస్ బి.చంద్రకుమార్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఎస్.వీరయ్య, ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, ప్రొఫెసర్ ననుమాస స్వామి, జిలకర శ్రీనివాస్, డాక్టర్ పసునూరి రవీందర్, కె.ఆనందాచారి, బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్, తంగిరాల చక్రవర్తి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

సరూర్‌నగర్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ 2వ డివిజన్ పరిధిలో గల పాత గ్రామంలో కొత్తగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్ జెనిగె పద్మా ఐలయ్యయాదవ్‌తో కలిసి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో పర్యటించి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా వెలుస్తున్న కాలనీలతో పాటు పాత గ్రామాల్లోనూ దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మునిసిపల్ డీఈఈ జ్యోతీరెడ్డి, ఏఈఈ వినీల్‌గౌడ్, కార్పొరేటర్ పి.సుదర్శన్‌రెడ్డి, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, నాగేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

నాదర్‌గుల్‌లో..

నాదర్‌గుల్ 31వ డివిజన్‌లోని గ్రీన్‌రిచ్ కాలనీలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మేయర్ పారిజాతానర్సింహారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఏఈఈ బిక్కూనాయక్, కాలనీ ప్రతినిధులు రమాకాంత్, మోహన్‌కృష్ణ, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

ఆయుర్వేదం ప్రపంచానికి దిక్సూచిగా మారాలి

● సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేద సైన్సెస్ డైరెక్టర్ శ్రీకాంత్

సైదాబాద్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యులు, శాస్త్రవేత్తలు ప్రణాళికాబద్ధంగా పరిశోధనలు చేసి ప్రపంచానికి దిక్సూచిగా మారాలని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేద సైన్సెస్(సీసీఆర్ఏఎస్) డైరెక్టర్ డాక్టర్ ఎన్. శ్రీకాంత్ పిలుపునిచ్చారు. గడ్డిఅన్నారంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్(ఎన్ఐఐఎంహెచ్)లో రెండు రోజుల పాటు నిర్వహించిన సంప్రదాయ వైద్యంలో ఔషధ అభివృద్ధిపై జాతీయ సెమినార్ బుధవారం ముగిసింది. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ పాశ్చాత్య సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఆయుర్వేదం చికిత్సా పద్ధతులను, సూత్రాలను పరిశీలించి నూతన ఆవిష్కరణతో భారతదేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పాలని అన్నారు. మన పూర్వీకులు మనకు అందించిన వేదాలలో ఆయుర్వేదం అపూర్వమైందని చెప్పారు. ఈ సెమినార్‌లో విశిష్ట శాస్త్రవేత్త డాక్టర్ మధు దీక్షిత్, ఆర్అండ్‌డీ హెల్త్‌కేర్ కోల్‌కత్తా సలహాదారు డాక్టర్ చంద్రకాంత్ కటియార్, ఎన్ఐఐఎంహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్(ఇన్‌చార్జి) డాక్టర్ జీపీ ప్రసాద్, ఆయుర్వేద శాస్త్రవేత్తలు, వైద్యులు, ఆయూష్ మంత్రిత్వ శాఖకు చెందిన పరిశోధన అధికారులు పాల్గొన్నారు.



జాతీయ సెమినార్‌లో మాట్లాడుతున్న సీసీఆర్ఏఎస్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్



అమీర్‌పేట స్వర్ణజయంతి కాంప్లెక్స్ హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయంలో బుధవారం మట్టి గణేష్ ప్రతిమలను పంపిణీ చేస్తున్న కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, అధికారులు - హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి



అబ్దుల్లాపూర్‌మెట్ నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న సుదర్శన్‌రెడ్డిని బుధవారం కాంగ్రెస్ పెద్దఅంబర్‌పేట్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, గంట లక్ష్మారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ గంట శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. - అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి



హయత్‌నగర్‌బస్ డిపో రోడ్డులో తొలగించిన ప్రహరీ



భాగ్యలత వద్ద అనుమతి లేకుండా నిర్మించిన రేకుల షెడ్డును కూల్చి వేసిన అధికారులు

హయత్‌నగర్‌లో అక్రమ షెడ్డు, ర్యాంపులను

తొలగించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు

హయత్‌నగర్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ బస్ డిపో రోడ్డులో రోడ్డుపైన నిర్మించిన ప్రహరీని, ఇతర నిర్మాణాలను హయత్‌నగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం తొలగించారు. జాతీయ రహదారి నుంచి హయత్‌నగర్ బస్ డిపోకు వెళ్లే రోడ్డు ఇరుకుగా మారింది. రోడ్డుకు ఇరు పక్కల అక్రమ నిర్మాణాలను చేట్టారు. దీంతో టౌన్ ప్లానింగ్ ఏసీపీ పావణి, సెక్షన్ ఆఫీసర్ ఎండీ అక్బర్, సిబ్బంది కలిసి ఎక్స్‌కవేటర్‌తో ఒక పక్క ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించారు. విజయవాడ జాతీయ రహదారిపైన భాగ్యలత వద్ద రాఘవేంద్ర హోటల్ పక్కన అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డును సైతం అధికారులు నేలమట్టం చేశారు. అదేవిధంగా హయత్‌నగర్ డిఫెన్స్ కాలనీలో రోడ్డును ఆక్రమిస్తు ర్యాంపులు నిర్మించారని కాలనీ నాయకుల ఫిర్యాదు మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు రోడ్లపైకి వచ్చిన ర్యాంపులను, ప్రహరీలను తొలగించారు.

స్పెక్ట్రా రియల్ ఎస్టేట్ కార్యాలయం వద్ద ధర్నా

కొత్తపేట, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధి కామినేని చౌరస్తా సమీపంలో గల స్పెక్ట్రా రియల్ ఎస్టేట్ కార్యాలయం వద్ద ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు బుధవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..ప్లాట్ల పేరుతో లక్షలాది రూపాయలు కట్టించుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఎల్బీనగర్, హయత్‌నగర్ ప్రాంతాల బాధితులు స్పెక్ట్రా రియల్ ఎస్టేట్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. బాధితులు తమ డబ్బులు తమకు ఇచ్చేయాలని అడిగితే సంస్థ వారు చెక్కులు అందజేశారని, ఆ చెక్కులు బౌన్స్ అవుతున్నాయని బాధితులు వాపోతున్నారు. పోలీసులు ధర్నా చేస్తున్న బాధితుల ఫిర్యాదు తీసుకుని వారిని పంపించేశారు. తమకు న్యాయం చేయాలని, సదరు సంస్థపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీసులను కోరారు.

ఉరేసుకుని గృహిణి ఆత్మహత్య



ఉరేసుకుని మృతిచెందిన మమత

హయత్‌నగర్: ఆర్థిక ఇబ్బందులు, భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగా గృహిణి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా గుండ్రాంపల్లికి చెందిన పాటి మమత(28) భర్త నరేందర్‌రెడ్డి(డీసీఎం డ్రైవర్) ఇద్దరు పిల్లలతో కలిసి కొంత కాలంగా హయత్‌నగర్ విష్ణునగర్‌కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో వారు బాధపడుతున్నారు. కాగా బుధవారం ఉదయం భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాక మమత ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇరుగుపొరుగు వారు చూసి భర్తకు, కుటుంబ సభ్యులకు ఫోన్‌చేయగా వారు వచ్చి తలుపులు పగులగొట్టి ఉరి నుంచి మమతను కిందకు తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జ్వరాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

●కామినేని ఆస్పత్రి పిల్లల వైద్యురాలు డాక్టర్ కంచన్ ఎస్.చన్నావర్



మాట్లాడుతున్న డాక్టర్ కంచన్ ఎస్.చన్నావర్, డాక్టర్ సౌజన్య

వనస్థలిపురం, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే జ్వరాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కామినేని ఆస్పత్రి పిల్లల వైద్యురాలు డాక్టర్ కంచన్ ఎస్.చన్నావర్ తెలిపారు. బుధవారం ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ సౌజన్యతో కలిసి ఆమె మాట్లాడారు. వర్షాకాలంలో పిల్లలకు సులభంగా వ్యాపించే వైరల్ ఇన్ఫెక్షన్లు, వైరల్ జ్వరం, డెంగీ, చికన్‌గున్యాతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో పిల్లలకు వైరల్ జ్వరాలు, ఇన్ఫెక్షన్లు ఎక్కువగా నమోదు అవుతున్న తరుణంలో చంటి పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు. పిల్లలకు రోగ నిరోధక శక్తి మెండుగా ఉండే విధంగా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ కాలంలో ఎక్కువగా లిక్విడ్ ఆహార పదార్థాలు ఇవ్వాలని, నీళ్ల బాగా తాగించాలని, వేడి ఆహార పదార్థాలను మాత్రమే ఇవ్వాలని ఆమె తెలిపారు. జ్వరం మూడు రోజులుగా తగ్గకపోతే వెంటనే వైద్యులను కలిసి, వైద్య పరిక్షలు చేయించుకోవాలని కోరారు.

ఆజంపుర పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోరీ



ఆరోగ్య కేంద్రంలో వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): ఆజంపుర పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తి చొరబడి చోరీకి పాల్పడ్డాడు. బుధవారం ఉదయం ఆరోగ్య కేంద్రం తెరిచే సరికి వైద్య పరికరాలు, మందులు, ట్యాబ్లెట్‌లు, ఇతర వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నట్లుగా గుర్తించిన వైద్య సిబ్బంది చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు రంగంలోకి దిగిన చాదర్‌ఘాట్ క్రైం పోలీసులు వివరాలు సేకరించే పనుల్లో నిమగ్నమయ్యారు. లాప్‌టాప్, ట్యాబ్‌లు కనిపించకపోవడంతో చోరీకి గురయ్యాయని వైద్య సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. చాదర్‌ఘాట్ క్రైం ఎస్ఐ పర్వేజ్ తన సిబ్బందితోపాటు క్లూస్ టీం రంగంలోకి దిగి చోరీ జరిగిన తీరుపై వివరాలు సేకరిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి ఆరోగ్య కేంద్రం బాత్రూం వెంటిలెటర్ నుంచి చొరబడి ఉంటాడని అనుమానిస్తున్నారు. అయితే ఏఏ వస్తువులు చోరీకి గురయ్యాయనే వివరాలను వైద్య సిబ్బంది పోలీసులకు ఫిర్యాదులో వివరించలేదని క్రైం ఎస్ఐ పర్వేజ్ తెలిపారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సౌత్‌జోన్ డీసీపీ స్నేహమెహరా, అడిషనల్ డీసీపీ జహంగీర్

అల్లరి మూకలపై పోలీసుల ఫోకస్ పద్ధతి మార్చుకోకపోతే.. కటకటాలే

● పలువురు రౌడీషీటర్లకు సౌత్‌జోన్ డీసీపీ కౌన్సెలింగ్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో త్వరలో అంగరంగ వైభవంగా జరగనున్న గణేష్ నవరాత్రులు, మిలాద్ ఉన్ నబీ ఉత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకునేలా పోలీసులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రజా రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణపై దృష్టి సారించిన పోలీసులు.. నగరంలోని ఆకతాయిలు, అల్లరిమూకలు, రౌడీలు, కేడీలపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ నేపథ్యంలో సౌత్‌జోన్ డీసీపీ స్నేహమెహరా, అడిషనల్ డీసీపీ జహంగీర్‌లు జోన్ పరిధిలోని పలువురు రౌడీషీటర్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉత్సవాల నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు సృష్టించినా, గొడవలు, కొట్లాటలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరి కదలికలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.



ఎమ్మెల్సీ కోదంరాంకు శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యాసంఘాల ప్రతినిధులు

ఎమ్మెల్సీ కోదండరాంకు విద్యాశాఖ మంత్రి పదవి ఇవ్వాలి

● విద్యార్థి సంఘాల వినతి

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన కోదండరాంను బుధవారం పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కేబినెట్‌లో విద్యాశాఖ పదవిని ఎమ్మెల్సీ కోదండరాంకు కేటాయించి విద్యావ్యవస్థలో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డేపల్లి రాకేష్, తెలంగాణ విద్యార్థి సమితి రాష్ట్ర అధ్యక్షుడు మంద రమేష్‌మాదిగ, విద్యార్థి యువజన సంఘం నాయకుడు సందీప్ తదితరులు ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఉన్నారు.



కంప్యూటర్లను అందజేస్తున్న వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణరెడ్డి, కౌన్సిలర్ గీతారెడ్డి

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని తట్టిఅన్నారం ప్రభుత్వ పాఠశాలకు కుంట్లూర్‌లోని పల్లవి ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రెండు కంప్యూటర్లతో పాటు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ దేవిడి గీతావేణుగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో మొక్కలను నాటారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంబీ రాజు, డైరెక్టర్ రామశేషగిరిరావు, రాజేందర్‌రెడ్డి, ఏఓ శ్రీధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సైదులు, శ్రీనివాస్, హెచ్‌వోడీ విశ్వప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు విజయభాస్కర్ ఎంపిక



విజయభాస్కర్

సైదాబాద్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు సైదాబాద్‌కు చెందిన డాక్టర్ ఎస్.విజయభాస్కర్ ఎంపికయ్యారు. విజయభాస్కర్ బహదూర్‌పూర జోన్ పరిధిలోని శాలిబండా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, పత్రిక రంగాలలో చేస్తున్న విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డు వచ్చినట్లు విజయభాస్కర్ తెలిపారు.

ఎన్‌సీసీ కెడెట్ వైష్ణవికి సన్మానం



కెడెట్ వైష్ణవి మడుపును సన్మానిస్తున్న ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ మధుసూధన్‌రెడ్డి

అల్వాల్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): నేషనల్ కెడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ)పై దృష్టి సారించే యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్(వైఈపీ) తాజాగా ఖజకిస్థాన్‌లో నిర్వహించారు. భారతదేశం, మధ్య ఆసియా దేశాల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడానికి ప్రతి ఏటా ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సికింద్రాబాద్ గ్రూపునకు చెందిన కెడెట్ వైష్ణవి మడుపు వివిధ రాష్ట్రాల నుంచి వెళ్లిన 11మంది ఎన్‌సీసీ కెడెట్‌ల ప్రతినిధుల బృందంలో ఖజకిస్థాన్‌ను సందర్శించి తిరిగి హైదరాబాద్‌కు వచ్చారు. ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ మధుసూదన్‌రెడ్డి బుధవారం వైష్ణవిని తన కార్యాలయంలో కలిసి ఖజకిస్థాన్‌లో నిర్వహించిన కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 99854 02786